క్లుప్తంగా

పిచ్చి మొక్కలు తొలగించండి

మున్సిపల్ కమిషనర్ శేషన్న



తెనాలిఅర్బన్: పిచ్చి మొక్కలను వెంటనే తొలగించి ఆహ్లాదకరంగా ఆవరణను తయారు చేయాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. రజక చెరువు వద్ద ఉన్న పార్కును శనివారం ఆయన పరిశీలించారు. పార్కును శుభ్రంగా ఉంచడంతో పాటు వాకర్స్‌కు అనుకూలంగా ఉంచాలన్నారు. వారికి ఎటువంటి ఇబ్బంది కలుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట హార్టికల్చర్ అధికారి శేషుబాబు, పలువురు మున్సిపల్ ఉద్యోగులు ఉన్నారు.

విద్యార్థులకు జామెట్రీ బాక్సుల పంపిణీ



తెనాలిరూరల్: మండలంలోని బుర్రిపాలెం గ్రామానికి చెందిన శ్రీ సర్వదేవ పరంజ్యోతి మానవ సేవా సమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు జామెట్రీ బాక్సులను శనివారం పంపిణీ చేశారు. గ్రామంలోని ఘట్టమనేని నాగరత్నమ్మ రాజా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 130 మంది విద్యార్థులకు బాక్సులను అందజేశారు. సమితి సభ్యులు, ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

జులై1న ఉచిత వైద్య శిబిరం



తెనాలి: డాక్టర్స్ డే సందర్భంగా రెయిన్‌బో ట్రస్ట్, తెనాలి, డాక్టర్ లతాస్ డయాబెటిక్ కేర్ సంయుక్త ఆధ్వర్యంలో జులై ఒకటో తేదీన ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్టు డాక్టర్ డి.జీవనలత తెలియజేశారు. ప్రకాశం రోడ్డు లోని లతాస్ డయాబెటిక్ కేర్‌లో నిర్వహించే శిబిరానికి సంబంధించిన కరపత్రాన్ని శనివారం ఆవిష్కరించి వివరాలను తెలిపారు. వైద్య శిబిరంలో బ్లడ్ షుగర్, థైరాయిడ్ స్క్రీనింగ్ పరీక్షలను ఉచితంగా చేసి, అవసరమైన మందులను ఉచితంగా ఇస్తామని తెలిపారు. స్త్రీలకు సంబంధించిన అన్ని వ్యాధులకు ఉచితంగా కన్సల్టేషన్, మందులు ఇవ్వనున్నట్టు వివరించారు. తెనాలి, పరిసరాల్లోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉపాధ్యాయుడు చంద్రశేఖర్‌కు డాక్టరేట్



చుండూరు(తెనాలి): బాపట్ల జిల్లా చుండూరు మండల గ్రామం మోదుకూరులోని వేమన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీష్)గా పనిచేస్తున్న మాదాసు చంద్రశేఖర్‌కు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డాక్టరేట్ లభించింది. 'మెటా-కాగ్నిన్, అచీవ్‌మెంట్ మోటివేషన్ ఆఫ్ సెకండరీ స్కూల్ పీపుల్స్ ఇన్ రిలేషన్ టు అకడెమిక్ అచీవ్‌మెంట్' అనే అంశంపై సమర్పించిన పరిశోధనకు యూనివర్సిటీ ఎడ్యుకేషన్ విభాగం నుంచి డాక్టరేట్‌ను అందుకున్నారు. డాక్టర్ జేఆర్ ప్రియదర్శిని మార్గ నిర్దేశనంలో ఈ పరిశోధన చేశారు. వేమన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.వెంకటేశ్వర్లు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

సుబ్రహ్మణ్యం సేవలు అభినందనీయం



తెనాలి: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా పని చేస్తున్న దోసకాయలపాటి సుబ్రహ్మణ్యం పదవీ విరమణ అభినందన సభ శనివారం రాత్రి కార్యాలయం ఆవరణలోని పాదుపు భవన్‌లో నిర్వహించారు. డివిజనల్ అడ్మినిస్ట్రేషన్ అధికారి కటారి జయజయరావు అధ్యక్షత వహించారు. విశ్రాంత రెవెన్యూ సంక్షేమ సంఘం జిల్లా సహాయ అధ్యక్షుడు ప్రసాద్, తెనాలి డివిజన్ అధ్యక్షుడు నాగశంకరయ్య, ఎడ్వర్డ్, విశ్రాంత తహసీల్దార్లు, కార్యాలయ సిబ్బంది వర్మ, మల్లేశ్వరి, హనిప్రియ, సీసీ నరేంద్ర, సిబ్బంది కలసి ఘనంగా సత్కరించారు. సుబ్రహ్మణ్యం వృత్తి జీవితంలో నిబద్ధతను, వ్యక్తిత్వాన్ని, గుణగణాలను కొనియాడారు.

రేపు విశ్వేశ్వరాలయం వార్షికోత్సవం

ఫిరంగిపురం: మండలంలోని వేమవరం గ్రామంలోని కాశీ విశాలాక్షి సమేత విశ్వేశ్వర స్వామి ఆలయ ఆరో వార్షికోత్సవం సోమవారం నిర్వహించనున్నట్లు గ్రామస్తులు శనివారం తెలిపారు. ఉదయాన్నే స్వామి వార్లకు నమక చమకాలతో వేదపండితుల ఆధ్వర్యంలో పంచామృతాభిషేకాలు నిర్వహిస్తారని చెప్పారు. అనంతరం అమ్మవారికి బిల్వ దళాలతో అష్టోత్తర, సహస్రనామ, కుంకుమార్చనలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

మలేరియా రహిత సమాజ స్థాపనకు కృషి

సహాయ మలేరియా అధికారి ప్రభాకర్‌రెడ్డి



ర్యాలీ చేపడుతున్న అధికారులు, సిబ్బంది

తెనాలిఅర్బన్: మలేరియా రహిత సమాజ ఏర్పాటులో ప్రజలందరూ భాగస్వాములు కావాలని తెనాలి సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్‌రెడ్డి కోరారు. మలేరియా మాసోత్సవాల ముగింపు ర్యాలీని పట్టణంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా మలేరియా నియంత్రణకు పోరాటాలు జరుగుతున్నాయని చెప్పారు. 2027 నాటికి మలేరియా కేసులు '0' కు వచ్చే విధంగా ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. 2030 నాటికి దేశంలో మలేరియాను పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యమని వివరించారు. ప్రతి సంవత్సరం జూన్ మాసంలో మలేరియా వ్యతిరేక మాసంగా జరుపుతున్నట్లు తెలిపారు. నెల రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో పట్టణ, మండల మలేరియా సబ్ యూనిట్ అధికారులు శ్రీకంఠ ఉమాకాంత్, వంగల పున్నారెడ్డి, హెల్త్ ఇన్‌స్పెక్టర్ జి.రవికుమార్, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, మార్త గ్రూఫ్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ సెక్రటరీ యనమల ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌తో కక్షిదారులకు మేలు



కక్షిదారులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీనివాసులు

తెనాలిరూరల్: కేసుల సత్వర పరిష్కారం కోసం లోక్ అదాలత్ చక్కటి వేదిక అని, తద్వారా కక్షిదారుల సమయం, ధనం ఆదా అవుతుందని 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి డి. శ్రీనివాసులు చెప్పారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశానుసారం, రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సూచనల మేరకు శనివారం స్థానిక న్యాయస్థానంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు ఎం. శ్రీధర్, పవన్‌కుమార్, పి.రాజశేఖర్ మాట్లాడుతూ ప్రస్తుతం నమోదు అవుతున్న కేసుల్లో చాలా వరకు కూర్చొని మాట్లాడుకుంటే పరిష్కారం అవుతాయని కాని కక్షిదారులు అనవసరమైన భేషజాలకు వెళ్లి సమయాన్ని, ధనాన్ని వృథా చేసుకుంటున్నారని అన్నారు. న్యాయస్థానంలో కేసులు జరిగితే ఎవరో ఒక్కరే విజయం సాధిస్తారని, అదే మధ్యవర్తిత్వం ద్వారా లోక్ అదాలత్ నందు రాజీ పడితే ఇరుపక్షాలు విజయం సాధిస్తారని పేర్కొన్నారు. ఈ లోక్ అదాలత్‌లో 33 సీవీలు, 73 క్రిమినల్, 11 ప్రిలిటిగేషన్, మోటారు వాహన ప్రమాద కేసులు ఏడు కలిపి పరిష్కారమయ్యాయి. బాధితులకు రూ.మూడు కోట్లు పరిహారం కింద అందించారు. ప్రభావతి, ఎ.కిషోర్, ఖాదర్‌హుస్సేన్, ఆర్.దయాకిరణ్ అదాలత్ మెంబర్లుగా వ్యవహరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్, న్యాయవాదులు, కక్షిదారులు, పోలీసులు, న్యాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

లైంగిక వేధింపులకు పాల్పడితే జీవిత ఖైదు



మాట్లాడుతున్న శివ కోటేశ్వరరావు, సంఘ సభ్యులు

తెనాలిరూరల్: కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన కొత్త చట్టాల ద్వారా ఇకపై మైనర్ బాలికలు, యువతులు, మహిళలపై లైంగిక వేధింపులు, దాడులకు పాల్పడితే అటువంటి వారు జీవిత ఖైదు అనుభవించాల్సిందేనని ది తెనాలి పట్టణ మరియు పరిసర ప్రాంత అభివృద్ధి సంఘ సభ్యులు తెలిపారు. స్థానిక కొత్తపేటలోని కార్యాలయంలో శనివారం ఉదయం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో న్యాయవాదులు, సంఘ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్త్రీలను లైంగిక వాంఛ తీర్చమని కోరినా పెద్ద నేరంగా ఇక నుంచి పరిగణిస్తారని చెప్పారు. రోడ్డు ప్రమాదానికి కారణమైన వ్యక్తులు/వ్యక్తి సమీప పోలీస్ స్టేషన్‌లో లొంగిపోవాలని లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని అలా కాని పక్షంలో పదేళ్ల వరకు శిక్ష పడే అవకాశం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఐపీసీ, సీఆర్‌పీసీ, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్‌ల పేర్లు మార్చి కొత్తగా ఐపీసీని భారతీయ న్యాయ సంహిత అని, సీఆర్‌సీపీని భారతీయ నాగరిక సురక్ష సంహిత అని, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్‌ని భారతీయ సాక్ష్ అధినియమ్ అని మార్పులు చేసిందని తెలిపారు. కొత్త చట్టాలు జులై 1 నుంచి అమలులోకి రానున్నాయని చెప్పారు. ఈ కొత్త చట్టంలో జీరో ఎఫ్ఐఆర్, ఎలక్ట్రానిక్-ఎఫ్ఐఆర్ అనేవి ప్రజలకు చాలా ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. అయితే కొన్ని చట్టాలు ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా ఉన్నాయన్నారు. పోలీస్ వ్యవస్థలో సంస్కరణలు తెచ్చిన తరువాతే కొత్త చట్టాలను అమలు చేయలి గాని హడావుడిగా కాదని చెప్పారు. కొత్త చట్టాల ద్వారా ఆశించిన ప్రజా ప్రయోజనం నెరవేరదని, పోలీసు శాఖల సంస్కరణలు పూర్తయ్యే దాకా ఈ చట్టాలను అమలు చేయవద్దని కోరారు. సమావేశంలో సంఘ అధ్యక్షుడు దరిశి శివ కోటేశ్వరరావు, రావూరి శివ శంకర్, అబ్దుల్ ఆరిఫ్, సోమయ్య శాస్త్రి, వాకా పేరిరెడ్డి, కొమ్ము అబ్రహం లింకన్ చెరుకూరి శివరామయ్య, వై రమేష్ తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో 11 మంది ఎంపిక

తెనాలిఅర్బన్: దేవేశీ రిక్రూట్‌మెంట్ ప్రైవేట్ సంస్థ నిర్వహించిన క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో ఎన్ఆర్‌కే కేఎస్ఆర్ గుప్తా డిగ్రీ కళాశాల విద్యార్థులు 11 మంది ఉద్యోగాలు సాధించినట్లు ప్రిన్సిపల్ గోగినేని విజయ కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్, హెచ్ఆర్ ఉద్యోగాలకు ఎంపిక జరిగినట్లు చెప్పారు. ఎంపికైన వారికి అభినందనలు తెలియజేశారు.

విద్యుత్ బిల్లులు చెల్లింపునకు ఏర్పాట్లు

తెనాలిరూరల్: వినియోగదారులు విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు ఆదివారం తమ కార్యాలయాల్లోని కేంద్రాలు పని చేస్తాయని విద్యుత్ శాఖ డీఈ వీవీ చిరంజీవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్ పరిధిలోని అన్ని విద్యుత్ రెవెన్యూ కేంద్రాలలో బిల్లు కౌంటర్లు ఉంటాయని చెప్పారు. ఏపీసీపీడీసీఎల్ మొబైల్ యాప్, సంబంధిత వెబ్‌సైట్ ద్వారా విద్యుత్ బిల్లులు సులభంగా చెల్లించవచ్చన్నారు.

చాంబర్ కార్యాలయంలో నీటి ట్యాప్‌ల చోరీ

తెనాలి: పట్టణ గంగానమ్మపేటలోని తెనాలి చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో ఆగంతకుడు చొరబడ్డాడు. ఆఫ్‌కోట్ వేసుకుని దర్జాగా ఉన్న యువకుడు గేటు పై నుంచి లోపలకు ప్రవేశించాడు. వాటర్ పైప్‌లకు ఉండే ట్యాప్‌లు, డాబాపై నుంచే వాటర్ ట్యాంక్ చెక్ వాల్స్, గేట్ వాల్స్ అన్నీ విప్పదీసుకుని వెళ్లాడు. శనివారం ఉదయం కార్యాలయానికి వెళ్లిన చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు దేసు శ్రీనివాసరావు ఈ విషయన్ని గమనించారు. సీసీ టీవీ ఫుటేజీ చూడగా ఈ నెల 27న తెల్లవారు జామున 5.30 గంటల తర్వాత జరిగినట్టు గుర్తించారు. చిల్లర దొంగతనాలకు పాల్పడుతున్నారని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు.

స్వస్థలంలో కేంద్ర మంత్రికి ఘన స్వాగతం



మంత్రి పెమ్మసానికి మొక్క అందజేస్తున్న ఎంపీడీవో విజయాలక్ష్మీ

తెనాలిరూరల్: గుంటూరు ఎంపీ, కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తన స్వస్థలం తెనాలి వచ్చిన సందర్భంగా ఆయనకు పలువురు ఘనంగా స్వాగతం పలికారు. కేంద్ర మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా ఆయన స్వస్థలం బుర్రిపాలెం వచ్చారు. శనివారం సాయంత్రం తెనాలి పర్యటనకు వస్తున్న పెమ్మసానికి పలువురు టీడీపీ నాయకులు, అభిమానులు ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా అంగలకుదురు వద్ద టీడీపీ నాయకులు పెమ్మసానికి గజమాలలతో స్వాగతం పలికి పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాతో సత్కరించారు. అనంతరం బుర్రిపాలెం రోడ్డులో ఎన్టీఆర్ విగ్రహానికి కేంద్ర మంత్రి పెమ్మసాని పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ నాయకులు, అభిమానులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం బుర్రిపాలెం రోడ్డులో శ్రీనివాసం అపార్ట్‌మెంట్ వాసులు మంత్రి పెమ్మసానికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అపార్ట్‌మెంట్ వద్ద రోడ్డు తదితర సమస్యల గురించి పెమ్మసాని చంద్రశేఖర్‌కు తెలియజేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం ఆయన బుర్రిపాలెంలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. బుర్రిపాలెం సమీపంలో స్వర్గీయ పెమ్మసాని సాంబశివరావు విగ్రహానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం గ్రామానికి చేరుకున్న పెమ్మసానికి స్థానికులు అడుగడుగునా ఘన స్వాగతం పలికారు. గ్రామస్తులను ఉద్దేశించి స్థానిక కల్యాణ మండపంలో మాట్లాడారు. తన గెలుపుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

విత్తనశుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలి



సబ్సిడీ విత్తనాలు రైతులకు అందజేస్తున్న ప్రేమ్‌సాగర్, రమాదేవి


తెనాలిరూరల్: రైతులు విత్తనశుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి జి.ప్రేమ్‌సాగర్ తెలిపారు. మండల గ్రామం పెదరావూరులోని రైతు భరోసా కేంద్రంలో సబ్సిడీపై రైతులకు అందజేస్తున్న వరి విత్తనాలను సర్పంచ్ కాకి రమాదేవి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏవో రైతులకు పలు సూచనలు చేశారు. కిలో విత్తనాలకు మూడు గ్రాముల కార్బెండిజమ్ లేదా ఎనిమిది గ్రాముల సూడోమోనాస్‌లో కలిపి 24 గంటల అనంతరం చల్లుకోవాలని సూచించారు. వెద పద్ధతి ద్వారా వరి సాగు చేయడం మేలని చెప్పారు. రైతు భరోసా కేంద్రాల సేవలను వినియోగించుకోవాలన్నారు. పాలడుగు సురేంద్ర, జాస్తి నరేంద్రనాథ్, వీఏఏలు, రైతులు, గ్రామ కార్యదర్శి కె.రామ సుబ్బారావు పాల్గొన్నారు.

దైవ సేవకులు ఐక్యంగా ఉండాలి



బిషప్ జాన్‌పాల్‌ను సత్కరిస్తున్న దైవ సేవకులు

తెనాలిరూరల్: దైవ సేవకులు ఐక్యంగా ఉండాలని ది తెనాలి యునైటెడ్ టౌన్ పాస్టర్స్ అండ్ గాస్పెల్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బిషప్ పినపాటి జాన్‌పాల్ అన్నారు. అసోసియేషన్ జూన్ నెల సమావేశాన్ని స్థానిక బీసీ కాలనీలోని ప్రిన్స్ ఆఫ్ పీస్ టెంపుల్‌లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బిషప్ జాన్‌పాల్ మాట్లాడుతూ దైవ సేవకులు ఐక్యంగా ఉండి ప్రార్థన చేస్తే దేశం క్షేమంగా ఉంటుందని చెప్పారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బిషప్ కె.అబ్రహం అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో దైవజనులు రెవరెండ్ ఎ.భాను ప్రసాద్, బ్రదర్ పి.ఐజక్, బ్రదర్ పి.ఆనందన్న, బిషప్ జె.ప్రభుదాస్, పాల్, ఎం.రమేష్, బ్రదర్ సాల్మన్ పాల్గొన్నారు. అనంతరం అసోసియేషన్ అధ్యక్షుడు పినపాటి జాన్‌పాల్‌ను దైవజనులు సత్కరించారు. సమావేశాన్ని బ్రదర్ రెడ్డిబోయిన అబ్రహం పర్యవేక్షించారు. తెనాలి పట్టణంలో ఉన్న దైవ సేవకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిలర్ల నేమ్ ప్లేట్‌లో తప్పులు దొర్లాయి. ఇటీవల ఎమ్మెల్యేగా గెలుపొంది రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నాదెండ్ల మనోహర్ పేరును బోర్డులో ఎక్స్ ఆఫీషియో మెంబర్‌గా పొందుపరిచారు. బోర్డులో ఆహారం, పౌర సరఫరాలు మరియు వినియోగదారుల వ్యవహారాల రాష్ట్ర మంత్రి వర్యులు అని రాయాల్సి ఉండగా కేవలం ఆహారం, పౌర సరఫరాలు మరియు వినియోగదారుల వ్యవహారాలు అని మాత్రమే పొందు పరిచారు. దీనిని చూసిన వారు ఇదేమి చోద్యమంటూ విమర్శలు చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి తప్పును సరి చేయాల్సిన అవసరం ఉంది.

–తెనాలి అర్బన్

సచివాలయ కార్యదర్శి ఆత్మహత్య

పట్నంబజారు : సచివాలయ కార్యదర్శి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై కేసు నమోదైంది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టాభిపురంలో నివాసం ఉండే అందుగుల జోయల్ శ్యామ్‌సన్ (44) గుంటూరు తూర్పు పరిధిలోని 53వ సచివాలయ కార్యదర్శిగా పనిచేస్తున్నాడు.కొద్దికాలంపాటు 52వ సచివాలయ కార్యదర్శిగా ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వర్తించారు. ఈక్రమంలో శనివారం ఉదయం 52వ సచివాలయ కార్యాలయం పైన ఉన్న స్టేషనరీ రూములోకి ఆ సచివాలయ ఉద్యోగి వెళ్లిన క్రమంలో భరించలేని దుర్వాసన వచ్చింది. సదరు ఉద్యోగి పరిశీలించడంతో జోయల్ శ్యామ్‌సన్ ఫ్యానుకు తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సుమారు పదిరోజుల క్రితమే ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

పరుచూరి రాఘవేంద్రరావుకు నివాళి



రాఘవేంద్రరావు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ప్రముఖులు

తెనాలి: పట్టణంలోని శ్రీ అరవింద ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు, విశ్రాంత ప్రిన్సిపాల్ పరుచూరి రాఘవేంద్రరావు సంస్మరణ సభ శనివారం సాయంత్రం శ్రీ అరవింద విద్యాకేంద్రం ప్రాంగణంలోని ధ్యాన మందిరంలో నిర్వహించారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ విద్యావేత్తగా రాఘవేంద్రరావు సమాజ హితం కోసం పని చేశారని చెప్పారు. సభకు అధ్యక్షత వహించిన చైతన్య వేదిక అధ్యక్షుడు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి మాట్లాడుతూ రాఘవేంద్రరావు ఉత్తమ విలువలతో జీవించిన ఆదర్శమైన వ్యక్తిగా కొనియాడారు. అరవింద విద్యాకేంద్రం డైరెక్టర్ కె.సంపూర్ణ, ప్రొఫెసర్ కొడాలి రాంబాబు, డాక్టర్ పాలడుగు ఉమా మహేశ్వరరావు, మొవ్వా సత్యనారాయణ తమ ప్రసంగాల్లో రాఘవేంద్రరావుతో తమకు గల అనుబంధాన్ని స్మరించుకున్నారు. తొలుత రాఘవేంద్రరావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. యడ్ల మోహనరావు, వి.నాగమల్లేశ్వరి, వై.పద్మశ్రీ,, ఆర్.నిర్మలాకుమారి, రాఘవేంద్రరావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన సదస్సు

మేడికొండూరు : మండల పరిధిలోని డోగిపర్రు గ్రామ సమీపంలో ఉన్న యూనివర్సల్ కళాశాలలో శనివారం క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ మమ్మిడాల్ హర్షదీప్తి క్యాన్సర్ లక్షణాలు వివరించారు. మహిళల్లో అధికంగా వచ్చే క్యాన్సర్లు, వాటిని ఎలా గుర్తించాలనే అంశాలపై అవగాహన కల్పించారు. కళాశాల సెక్రటరీ పామిశెట్టి బాలస్వామి మాట్లాడుతూ క్యాన్సర్‌కు వయస్సుతో సబంధం ఉండదన్నారు. క్యాన్సర్ విషయంలో నిర్లక్ష్యం వహించరాదన్నారు. ముందస్తుగా గుర్తిస్తే క్యాన్సర్‌ను జయించవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కేశవరెడ్డి, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ రమేష్, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ మర్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సప్తస్వరాల భక్తి గీతాలాపన

నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై శనివారం సాయంత్రం విశ్వశాంతి ఆర్ట్స్ అకాడమీ భక్తి సంగీత విభావరి జరిగింది. ఆలయ అధ్యక్షులు సి.హెచ్.మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. గాయనీ, గాయకులు గాదె రత్నారెడ్డి, పెకూరు కృష్ణారావు, బీఎస్.పోతురాజు, ఎం.నాగేశ్వరరావు, రవికిరణ్ తదితరులు సినీ, భక్తి గీతాలను ఆలపించారు. తబలాపై బాలాజీ, కీబోర్డుపై ఆదాం, ప్యాడ్స్‌పై రాజు చక్కటి వాయిద్య సహకారం అందించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి అట్ల రామకృష్ణారెడ్డి పాల్గొనగా, ప్రేక్షకులను అలరించింది.

'నీట్'ను వెంటనే రద్దు చేయాలి



మాట్లాడుతున్న కేశన శంకరరావు

మంగళగిరి: దేశ వ్యాప్తంగా డాక్టర్లను తయారు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం వైద్య విద్యార్హత పరీక్ష నిర్వహణకు నియమించిన నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ(ఎన్‌టీఏ) ద్వారా జాతీయ స్థాయిలో నిర్వహించిన నీట్ వెంటనే రద్దు చేయాలని రాష్ట్ర బీసీ సంక్షేమ అధ్యక్షుడు కె. శన శంకరరావు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో శంకరరావు మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజీపై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో దర్యాప్తు చేయించి, నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించి పరీక్షను ఎంతో జాగ్రత్తతో.. కఠిన నిబంధనలతో జరపాల్సి ఉండగా.. పేపర్ లీకేజీ కావడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వం, ఎన్‌టీఏల నిర్లక్ష్య వైఖరితోనే నీట్ పేపర్ లీకేజీ జరిగిందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని నీట్ పేపర్‌ను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్, ప్రతినిధులు కొల్లూరి హనుమంతరావు, ఉప్పాల రాజ్‌కిరణ్ పాల్గొన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీలో చేర్పించాలి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సూపర్‌వైజర్ కృష్ణకుమారి

తాడికొండ: మూడేళ్లు దాటిన చిన్నారులందరినీ అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించాలని ఐసీడీఎస్ తాడికొండ సెక్టార్ సూపర్‌వైజర్ కె.కృష్ణకుమారి సూచించారు. అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా తాడికొండ వైసీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీలలో చిన్నారులను చేర్పించి, వారికి పూర్వ ప్రాథమిక విద్యను అందించడం ద్వారా పిల్లల్లో సమగ్ర వికాసానికి పునాదులు వేసినట్లవుతుందన్నారు. ఆటపాటలతో ఆహ్లాదభరిత వాతావరణంలో ప్రీ స్కూల్ నిర్వహించడం జరుగుతుందన్నారు. అంగన్‌వాడీ కిట్‌లు ప్రదర్శించి వాటి ఉపయోగాలను తెలియజేశారు. అనంతరం తల్లులు, పిల్లలు, అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు అంగన్‌వాడీలు, సిబ్బంది పాల్గొన్నారు.

చేబ్రోలు డిగ్రీ కళాశాలలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో చేబ్రోలులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్కిల్‌హబ్‌లో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ కల్పిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి. ప్రణయ్ శనివారం ఓప్రకటనలో తెలిపారు. మూడు నెలలపాటు శిక్షణ కల్పించి, జిల్లాలోని వివిధ పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు చూపిస్తామని తెలిపారు. ఇంటర్ ఆపై విద్యార్హతలు గల నిరుద్యోగ యువతీ, యువకులు జూలై 3వ తేదీలోపు స్కిల్‌హబ్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 96665 45975 నంబర్లో సంప్రదించాలని తెలిపారు.